# ఆడజన్మ

శ్రీ పులిపాక
జగన్నాథరావు

త్రను ఈ శారీరక బాధను భరించలేకుండా ఉన్నది. ఈ మానసిక బాధను అసలే భరించలేకుండా ఉన్నది. తనతండ్రి ఒక్కడూ వచ్చి ఆ రెండువేలరూపాయలు ఇస్తే తప్ప తను ఈ నరకకూపంనుంచి బయటపడదట! బుద్ధిహీనులు! పాపాత్ములైన ఈ గూండాలు తను ఈ నరకకూపంనుంచి బయటపడటం పెద్ద ఆనందాయకంగా తలుస్తుందని భ్రమపడుతున్నారు. అవును! నిజమే! తను ఈ నరకకూపంనుంచి బయటపడాలనే తలుస్తున్నది. రహస్యమైన వీళ్ల స్థావరం తనకు నరకకూపం లాంటిదనీ, తను తన తండ్రి దగ్గరికి చేరటం దీనినుండి తను బయట పడమనీ వీళ్లభావనఐ ఉంటుంది. కాని వీళ్లు పూర్తిగా పొరబడ్డారు. తనకు తన శీలం చెడిన తరువాత పరమపవిత్రమైన ప్రియధాత్రి యావత్తూ నరకకూపం లాంటిదే! తను బయట పడటం తన బొందిలోనుంచి ప్రాణం పోయినప్పుడే! తను తన శీలం చెడకమునుపే తన వదినలాగా విషం త్రాగి చనిపోతే బాగుండేది! ఐనా తన నొసట తన భవిష్యత్తు ఇలా రాయబడి ఉన్నప్పుడు తన కలాంటి యోగ్యమైవ యోచన ఎలా వస్తుంది!...పోలీసులకు తనతండ్రి ఈ విషయం తెలియ చేశాడనే వర్తమానంగాని, నమ్మకద్రోహం జరిగిందనే ఆ చోకీగాని వీసమెత్తు తెలిసినా తన ప్రాణాలకు, తనతండ్రి ప్రాణాలకు పూర్తిగా ఆశ వదులుకోవచ్చునట. రెండువేలరూపాయలుకోసం వీళ్లమాట. తనతండ్రి నమ్మటానికిగాను వీళ్లు తనను, వీళ్లు రాసిన పత్రంపై సంతకం చేయమంటున్నారు. కేవలం తనను బాధించటమే పనిగా పెట్టుకున్నారు వీళ్లు. లేకపోతే మాంసం బలవంతంగా తనచేత తినిపించాలని రాత్రి వీళ్లుచేసిన ప్రయత్నానికి అర్థమేమైనా ఉందా? అయ్యో! తనకు ప్రాణం తీసుకోటానికి కూడా స్వాతంత్రం లేదే! తనతండ్రి తప్పనిసరి కాగా, తన సహాయంతో రెండువేలరూపాయలతో ఈ గూండాల చేతిలో పడక తప్పించుకు వెళ్లిపోవటానికి తను వెయ్యిదేవుళ్ళకు మొక్కుకుంది గాని, వీళ్లు ఆ విషయాన్ని పసిగట్టుతారనీ ఇలా తను ఈ అగ్నిపరీక్షకు గురవుతుందనీ తలచలేదు. ఐనా తను తన శీలాన్ని పోగొట్టుకుని ఏ ముఖంతో తన తండ్రి ముఖం చూస్తుంది! ఛీ, ఛీ! ఎంత సిగ్గుచేటుగా, ఎంత రోతగా, ఎంత కంపరంగా ఉన్నది ఈ తలంపు తనకు! పాపాత్ములైన ఈ గూండాలతో పోట్లాడుతూ తన కళ్ళ ఎదుటే చనిపోయిందితనభర్తను తనెలాతలుస్తుంది! ఈ పాపాత్ములు...నిర్దాక్షిణ్యంగా తనను కట్టివేసి...తన శీలాన్ని చెరుస్తున్నప్పుడు.. తనపాప తన అసహాయత్వానికి ఏడిచింది. అప్పుడు ఒకడు...దాని గొంతును పిసికి...

చంపివేశాడు. అబ్బ! ఎంతబాధ! ఎంత బాధ! దహనం...అంతులేని దహనం... గృహాదహనం...పశువుల దహనం...అంతులేని ఆస్థిపాస్తుల దోపిడి...నిన్న ఉదయాన ఈ పాపాత్ములు తమ ఇంటిని కొల్లగొట్టకముందు...తనతండ్రి ఏడుస్తూ ఇంటికి వచ్చి...తన అన్న దారుణంగా హత్యచేయబడ్డాడనీ...వాడి వశం...ఒకగోనె సంచిలో ముక్కలు ముక్కలు చేయబడి కనిపించిందనీ చెప్పాడు. తన కళ్లల్లో నీరు ఇంకిపోయిందా?... తనగుండెలు కష్టాల్ని అనుభవించీ...హత్యల్ని చూసి చూసీ రాతిలాగా కరుడుకట్టుకు పోయిందా? లేకపోతే ఆ వార్త విన్నప్పుడు...తన ముఖం తెల్లగా పాలిపోయిందే గాని...అంతకుమించి ఏమీ చలనం తనలో కలగలేదేమిటి? ఇదేం లోకం! ఇదేం ప్రభుత్వం? ఈ కష్టాల్లో తనకూ, తన తండ్రికీ ఎవ్వరిసానుభూతీ అవసరంలేదు. తనదృష్టిలో ఉత్తప్రయోజనం లేని సానుభూతి కేవలం అవమానకరం. ఐనా మతాలు వేరైనా మనసులు ఒక్కటై, సంఘంలోని సరైన మనుష్యులంతా సంఘీభావంతో ధైర్యంగా గూండాలను ఎదుర్కోవాలి గాని లేకపోతే తన భర్తలాంటి కొంతమంది మనుష్యులను గూండాలను ప్రతిఘటిస్తే నిస్సారమైన ఎడారిలాంటి భూమి మిగులుతుంది. బూడిద మిగులుతుంది. అస్థిపంజరాలు మిగులుతై......

——ఇప్పుడు తను ఎంతో శారీరక బాధకు గురవుతున్నది. ఐనా తను నిలబడుతుంది ఈ అగ్నిపరీక్షకు. శీలం చెడిన తరువాత తన శరీరాన్ని చూసుకుంటే తనకే అసహ్యం వేస్తుంది. తను ఈ పత్రంపై సంతకం చేయరాదు. సంతకం చేయకపోతే.. వీళ్లు తనను పెట్టే శారీరక బాధలకు తను ఆడజన్మఎత్తి సహించలేదు గాని ... సహజంగా సహించలేదుగాని...ఇప్పుడు సహించక తప్పదు. వీళ్లు పెట్టే బాధలను తను సహించక తప్పదు. ఇది సాధారణమైన పరిస్థితి. అయ్యో! ఎంతోబాధ! ఐనా తను వీళ్ల పశుబలానికి లొంగరాదు. తను తన బలహీనమైన ఈ మనుష్య ప్రకృతిని జయించాలి! తను తప్పక జయించాలి! తను తన శీలం చెడకముందే ఈ అగ్నిపరీక్షకు నిలిచినట్లయితే తను తన వదినలాగా దేవతే అయ్యేది...తన ఈ అగ్నిపరీక్షకు నిలబడి తన ప్రాణాల్ని అర్పించి...అనంతమైన ఆత్మ సంతృప్తిని పొందుతుంది; తన ఆడజన్మను సార్థకం చేసుకుంటుంది.

కథాంజలి

అన్ని హిగ్గిన్ బాథమ్సు బుక్ స్టాల్సు లోను దొరకును. వెల 0-3-0